క్లుప్తంగా

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో హోమియో వైద్యశిబిరం



చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు శిబిరాన్ని ప్రారంభించారు. హోమియో వైద్యుడు డాక్టర్ మణికంఠ రోగులకు పరీక్షించి వారికి అవసరమైన మందులు క్లబ్ సహకారంతో ఉచితంగా అందచేశారు. శిబిరాన్ని క్లబ్ ప్రతినిధులు దింటకుర్తి జ్యోతి, అనూష, వాణి, నంబూరి కుసుమకుమారి పర్యవేక్షించారు.

వైభవంగా శ్యామలాంబదేవి జయంతి



పెడన: దేవాంగ సామాజికవర్గ ఆరాధ్య దైవం శ్రీశ్యామలాంబ అమ్మవారి జయంతి మహోత్సవాలను సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని బ్రహ్మపురంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి చౌడేశ్వరి దేవాలయం, భజనగుడి, శ్రీశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భజనగుడిలోని అమ్మవారి చిత్రపటాన్ని శాకంబరీదేవిగా అలంకరించారు. అదే విధంగా శ్యామలాంబ సమేత ఆలయంలోని అమ్మవారిని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. ఏకరుద్రాభిషేకం, కుంకుమార్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ముత్యాలమ్మ ఘటం గుడిలో అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేటకు చెందిన ఉద్దండి శివశంకరరావు(32) గుండెపోటుతో మరణించగా మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యలవర్తి వెంకటేశ్వరరావు మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం నగదు అందించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గాజుల వాసుదేవ పాల్గొన్నారు.

డాక్టర్ మహేష్‌కు అభినందన



చిలకలపూడి(మచిలీపట్నం): జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో అమర్‌నాథ్ యాత్రకు వచ్చే భక్తులకు వైద్యసహాయం నిమిత్తం జిల్లాకు చెందిన వైద్యాధికారి సేవలు అందించటంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి అభినందనలు తెలిపారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యాధికారి యార్లగడ్డ మహేష్ గందర్బల్ జిల్లాలో ఉన్న బాల్టాల్ బేస్ క్యాంప్ ఆస్పత్రిలో యాత్రికులకు వైద్యసేవలు అందించేందుకు విధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు డీఎంహెచ్‌ఓ సిఫార్సు చేశారు. దీంతో వైద్యాధికారి మహేష్ జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు యాత్రకు వచ్చిన ప్రయాణికులకు వైద్యసేవలు అందించి తిరిగి అవనిగడ్డకు చేరుకున్నారు. అమర్‌నాథ్ యాత్రకు వచ్చిన యాత్రికులకు వైద్యసేవలు అందించటంపై డీఎంహెచ్‌ఓ గీతాబాయి ఆయనను అభినందించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుడివాడటౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సంస్థ అభివృద్ధికి సూచనలు సలహాలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను 99592 25464 మొబైల్ నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

- ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నారు
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ప్రజాగ్రహం

నాగాయలంక: గ్రామాల్లో వలంటీర్ల సేవలు ఎనలేనివని, ప్రతిపక్షాలు రాజకీయాల కోసం వలంటీర్ల సేవలను కించపర్చే రీతిలో మాట్లాడడం సహేతుకంగా లేదని పల్లెల్లో ప్రతి ఒక్కరూ వాపోతున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వలంటీర్లు విశేష సేవలందిస్తున్నారని, ఈ వ్యవస్థను ప్రవేశపెట్టిన జగనన్నదే అసలు గొప్పదనమని గ్రామీణులు తమ మనోగతాన్ని చెప్పారు. నాగాయలంక మండలంలోని భావదేవరపల్లి శివారు కుగ్రామం కుమ్మరిపాలెం. గ్రామానికి చెందిన వలంటీర్ యర్రవరపు వెంకటలక్ష్మికి పేదవారికి సేవలు అందించడమంటే అమితానందం. జగనన్న వలంటీర్‌గా అందించిన అవకాశంతో తమ గ్రామంలో గ్రామస్తులకు సేవలు అందించడం గర్వకారణం అంటుంది వెంకటలక్ష్మి. కోవిడ్–19 సమయంలో ఇంటింటికీ అనేక సేవలు అందించిన వలంటీర్లను పవన్ కళ్యాణ్ అనుచితంగా మాట్లాడటం ఆవేదన కలిగిస్తుందని ఆమె వాపోయింది. గత జనవరిలో గ్రామస్తురాలు నల్లూరి బాలకోటేశ్వరమ్మకు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ అక్కడికి వెళ్లి ఆ నెల వితంతు పింఛన్ రూ.2,750 నగదును ఆమెకు అందజేసి వచ్చింది. మరోసారి విజయవాడ గుణదలలో ఆశ్రయం పొందుతున్న సమయంలో ఆమెకే వలంటీర్ పింఛన్ అందించి మన్ననలు పొందింది. ఇదే గ్రామానికి చెందిన నల్లూరి రేణుకమ్మ పెడనలో ఇటుక పనులకు వెళ్లి అస్వస్థతకు గురై బందరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంటే వెంకటలక్ష్మి అక్కడికి వెళ్లి వితంతు పింఛన్ అందించింది. గ్రామంలోని నల్లూరి వెంకట రమణయ్య(46) ఇటీవల గుండెపోటుతో మరణిస్తే వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరుకు దగ్గరుండి తోడ్పాటునిచ్చింది. పేదలపై జగనన్న చూపుతున్న ఆదరణను, వలంటీర్ల సేవలను తప్పుబడుతున్న పవన్‌కళ్యాణ్, చంద్రబాబు తీరుపై ఈ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బాలకోటేశ్వరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి(ఫైల్)

వలంటీర్ వల్లే వైఎస్సార్ బీమా వచ్చింది



మా అబ్బాయి నల్లూరి వెంకట రమణయ్య గుండెపోటుతో ఇటీవల చనిపోయాడు. మా వలంటీరు వెంకటలక్ష్మి దగ్గరుండి ఆదుకుంది. మాకేమీ తెలియక పోతే వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేయించి, రూ.లక్ష వచ్చేలా సహాయపడింది. ఇలాంటి గ్రామాల్లో మాలాంటి ఏమీ తెలియనోళ్లకు వలంటీర్లే పెద్ద దిక్కుగా ఉన్నారు. ఇలాంటి వారిని రాజకీయాలు కోసం తప్పు పట్టడం మంచి పద్ధతి కాదు.

–నల్లూరి అలివేలు మంగతాయారమ్మ, కుమ్మరిపాలెం, నాగాయలంక మండలం

వలంటీర్లను నిందించడం దుర్మార్గం



మేము పెడన సమీపంలో ఇటుక పనులకు వెళ్తూ మా తల్లి రేణుకమ్మను కూడా వెంట తీసుకువెళ్లాం. ఆమెకు సుస్తీ చేసి బందరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనే మా వలంటీర్ వెంకటలక్ష్మి ఆస్పత్రికి వచ్చి పింఛన్ నగదు ఇచ్చింది. ఇలా గొప్ప సేవలు అందంచే వలంటీర్లను పవన్‌కళ్యాణ్ లాంటివారు నిందించడం దుర్మార్గం. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

–నల్లూరి రామాంజనేయులు, కుమ్మరిపాలెం, నాగాయలంక మండలం

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. లక్ష్మీపురం గ్రామ సచివాలయం–1 పరిధిలోని చింతలమడ ఎస్సీ కాలనీ, ఓసీ కాలనీల్లో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్ బాబు 273 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల రూపంలో పేదలకు అందిస్తున్న ఆర్థిక సహాయంతో గ్రామాల్లో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. ఫలితంగా రాష్ట్ర అభివృద్ధి రేటు పెరగటంతో వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు రాష్ట్రంలో వందల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ఆర్థిక ప్రగతికి సీఎం జగన్ బాటలు వేస్తున్నారని తెలిపారు.

మరోసారి ఘన విజయం ఖాయం..

ప్రతి గడపలో పేదల కళ్లల్లో కనిపిస్తున్న చిరునవ్వు చూస్తే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం కనిపిస్తోందని ఎమ్మెల్యే రమేష్‌బాబు స్పష్టం చేశారు. సీఎం జగన్ నిర్దేశించిన లక్ష్యం 175 సీట్లు సాధించటం సుసాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ చిన రాట్నాలు, సర్పంచ్‌లు కొల్లూరి కోటేశ్వరరావు, వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యన్నారాయణ(నాని), ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి కొండలు, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, నాయకులు బొందలపాటి లక్ష్మి, మోదుమూడి కుటుంబరావు, కొల్లూరి ముద్దుకృష్ణ, మేరుగు రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



చింతలమడ ఎస్సీ కాలనీలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

వార్షిక ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): తమకు వార్షిక ఇంక్రిమెంట్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.గోపీచంద్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ పి.రాజాబాబును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మొదటి నోటిఫికేషన్ ద్వారా నియమితులైన తమకు జూలై 1వ తేదీ నుంచి రెగ్యులర్ పే స్కేల్ తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారని గోపీచంద్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ నాయకులు మోహనకృష్ణ, కాంతారావు, శ్రావణ్‌కుమార్, రేవంత్ తదితరులు ఉన్నారు.

ఇంటింటి సర్వే విజయవంతం చేయండి

పామర్రు: బూత్ లెవెల్ అధికారులు అందరూ ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించే ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బూత్ లెవెల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు అందరూ మండలంలోని 25 గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. మృతి చెందిన వారి వివరాలను లిస్టు నుంచి తొలగించి, 18 ఏళ్ల నిండిన వ్యక్తుల పేర్లను కొత్తగా నమోదు లిస్టులలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ల నమోదు ప్రక్రియను ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని అన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తయ్యే విధంగా అందరూ కలిసి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రాము, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

పెడన: విద్యార్థులను స్కూళ్లకు తీసుకువెళ్లే ఆటో, బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలతో పాటు ఆర్టీఏ నిబంధనలను పాటించాలని పెడన ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో సోమవారం ఆయన ఆటో, బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరిని ఉద్దేశించి ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. యూనిఫాం ధరించడం నామోషి కాదని, వృత్తికి చిహ్నంగా భావించి గౌరవించి నడుచుకోవాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దన్నారు. పల్లోటి స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రయాణికులుగా భావించకుండా తమ సొంత బిడ్డలు వలే పాఠశాలలకు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఆటో, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో, బస్సు డ్రైవర్లతో ఎస్‌ఐ రవిచంద్రకుమార్

మచిలీపట్నం చేరిన లెనిన్ నాగకుమార్ మృతదేహం



మచిలీపట్నంటౌన్: ఈ నెల 4వ తేదీ తెల్లవారు జామున కెనడాలోని వాటర్ ఫాల్స్‌లో స్నానం చేస్తూ చనిపోయిన మచిలీపట్నంనకు చెందిన పోలుకొండ లెనిన్ నాగకుమార్(24) మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నాగకుమార్ మృతదేహాన్ని బందరు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే పేర్ని నానికి విన్నవించారు. ఎంపీ, ఎమ్మెల్యే కృషితో నాగకుమార్ మృతదేహం సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో అంబులెన్స్‌లో మృతదేహాన్ని బందరులోని చింతగుంటపాలెంలోని అతని నివాసానికి తీసుకువచ్చారు. నాగకుమార్ మృతదేహం ఇంటికి తీసుకురావడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. నాగకుమార్ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు



కృత్తివెన్ను మండలంలో దుక్కి దున్నుతున్న రైతు (ఇన్‌సెట్) యండపల్లి వద్ద విత్తనాలు వెదజల్లుతున్న రైతులు

వర్షాలకు తోడు పంట కాలువలకు సాగునీరు విడుదల కావడంతో రైతాంగం ఖరీఫ్ పనుల్లో ముమ్మరంగా బిజీ అయ్యింది. మండల వ్యాప్తంగా సుమారు 7,500 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌ను రైతులు సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. గతంలో కంటే ఈ ఏడాది ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గింది. కొన్ని గ్రామాల్లో రైతులు తమ భూములను ఆక్వా చెరువులుగా మార్చడంతో సాగు తగ్గింది. ప్రస్తుతం సాగుకు పరిస్థితులన్నీ అనుకూలంగా ఉండటంతో రైతులు దుక్కులు, నారుమళ్లు, వెదజల్లడం, వరి నాట్లు పనుల్లో వ్యవసాయ క్షేత్రాల్లో బిజీగా గడుపుతున్నారు.

–కృత్తివెన్ను

వైఎస్సార్ కంటి వెలుగుకు ప్రభుత్వం ప్రాధాన్యం

కంకిపాడు: వైఎస్సార్ కంటి వెలుగుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప్పులూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు సచివాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించినట్లు తెలిపారు. దృష్టిలోపాలు ఉన్న వారిని గుర్తించి కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలకు సిఫారసు చేస్తామన్నారు. కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, డీఓఏ చందన, ఎంఎల్‌హెచ్‌పీ శివదుర్గ, ఏఎన్ఎం మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

అవనిగడ్డ: అవనిగడ్డ బార్ అసోసియేషన్ సభ్యుడు గొరిపర్తి శ్రీనివాసరావుపై దాడి చేయడాన్ని నిరసిస్తూ అవనిగడ్డ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్ మాట్లాడుతూ శ్రీనివాసరావుపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి వేణుగోపాలరావు, కోశాధికారి బడే రఘుకుమార్, సీనియర్ న్యాయవాదులు పర్చూరి రాఘవేంద్రరావు, అందే శ్రీరామకృష్ణ, నీలకంఠ వెంకటేశ్వరరావు, బడే శేషగిరిరావు, ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

నాడు – నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

గుడ్లవల్లేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద నిర్వహిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ జి.గోపాలరావు ఆదేశించారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీలతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలోనే మండలానికి మంచి పేరు తేవాలని కోరారు.

‘జగనన్న సురక్ష’ను పకడ్బందీగా నిర్వహించండి

జిల్లాలో జగనన్న సురక్షపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రత్యేక కార్యదర్శి

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాలయం నుంచి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, అదనపు కార్యదర్శులు ముత్యాలరాజు, భరత్‌గుప్తాలు కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం కృష్ణాజిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. ఇంటింటికి సర్వే, ధ్రువీకరణ పత్రాల జారీ 92 శాతం పూర్తయ్యిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లాలో 82 శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. పరిష్కారం పొందిన ప్రతి ఒక్కరు పోరునిలో సంతృప్తిస్థాయి పెంపొందించామని చెప్పారు. అనంతరం కలెక్టర్ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలపై 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వహించరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్నకు చెబుదాం నోడల్ అధికారి శివనారాయణరెడ్డి, డీఎల్‌డీఓ సుబ్బారావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరంలోని 37వ డివిజన్‌లో సోమవారం పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. రూ.3.50 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో 135 మీటర్లు, రూ.1.30 లక్షలతో 45 మీటర్ల మేర నిర్మించనున్న పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా పని చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు ఐనం తాతారావు, మాచవరపు రాంప్రసాద్, కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, నాయకులు బందెల థామస్‌నోబుల్, శ్రీకాకోళపు నరసింహగుప్తా, మొహమ్మద్ రఫీ, మరీదు నాగరాజు, సమనం వెంకన్న, పురంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు, పక్కన వెంకటేశ్వరమ్మ, సలార్‌దాదా తదితరులు

ఆక్వాజోన్ పరిధిలో ఉన్న భూములకే అనుమతులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆక్వా జోన్ పరిధిలో ఉన్న భూములకు మాత్రమే ఆక్వా సాగుకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో సోమవారం ఆక్వా జోనేషన్ రీ–సర్వే పురోగతిపై మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూముల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. గతంలో అనుమతులు పొంది ఆక్వా జోన్ పరిధిలో సాగు చేస్తూ లైసెన్సు గడువు ముగిసిన వారు, నాన్ ఆక్వాజోన్ పరిధిలో అనధికారికంగా సాగు చేస్తున్న భూములను గుర్తించాలన్నారు. ఈ క్రమంలో లైసెన్సులను పునరుద్ధరించదగిన వాటికి నిబంధనల మేరకు చేయాలని చెప్పారు. ఆ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను బట్టి వ్యవసాయానికి పనికిరాని భూములను ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా ఆక్వా సాగుచేస్తున్న చెరువులను గుర్తించటంతో పాటు తక్కువ విస్తీర్ణంలో లైసెన్సు పొంది ఎక్కువ విస్తీర్ణంలో చెరువులు తవ్వి సాగు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్ణీత సమయానికి ఆక్వా జోనేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనధికారికంగా సాగు చేస్తున్న వారి వివరాలను ఈ నెల 31 నాటికి నివేదికను సమర్పించాలన్నారు. జిల్లా మత్స్యశాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు ఇతర మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి తెలిపారు. 8వ సచివాలయ పరిధిలోని 20, 21వ వార్డుల్లో జగనన్న సురక్ష క్యాంప్‌ను బీజీకే జెడ్పీహెచ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు శాశ్వతంగా అందుతూనే ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ సీఎం కావాలన్నారు. అప్పుడే నిరుపేదలకు సంక్షేమ ఫలాలందుతాయని చెప్పారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

సేవారత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను సన్మానించారు. ఈసందర్భంగా ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లను ఎవరైనా ఏమైనా అంటే ఊరుకునేది లేదని, వారికి వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులు అండగా ఉంటామని పాల్గొన్న ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. 135 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్, కొసనం కరుణకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మల్లి, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, టీపీఓ ఏసుబాబు, ఆర్‌ఐ మణికుమార్, సచివాలయ అడ్మిన్ రమ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. కమలాపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 70 ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ రాజులపాటి వాణి అందజేశారు. వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, నాయకులు అచ్యుతరావు, రామానాయుడు, కొండవీటి నాగబాబు, బైరవలింగం, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పెడనలో వలంటీర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

నేడు జగనన్న అమ్మఒడి వేడుకలు

కోడూరు: జగనన్న అమ్మఒడి మండల స్థాయి వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు సోమవారం తెలిపారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే వేడుకల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారన్నారు. నాల్గవ విడత అమ్మఒడి చెక్కు పంపిణీ ఉంటుందని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో తన పిల్లలను చదివించే తల్లులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఎంఈఓ కోరారు.